05ATP27.qxd:05ATP27.qxd 20/07/26 10:46 PM Page 1



## కన్న కొడుకుని హత్య చేసిన కేసులో తల్లి అరెస్టు..

**కదిరి, జులై 19 ప్రభాతవార్త**

కన్న కొడుకు హత్య చేసిన కేసులు తల్లినిఅరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని మారుతీనగర్‌లో నివాసముంటూ తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ విజయ బాబు భార్య డక్కా నందిని, తన ఐదేళ్ల కుమారుడు వర్షిత్‌ను ఫిబ్రవరి 12న హత్య చేసినట్లు కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై బాలుడి తండ్రి, కదిరి నివాసి మరియు వైద్యుడు డాక్టర్ విజయబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న కుటుంబ కలహాల కారణంగా తన భార్య డక్కా నందిని తన కుమారుడిని చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు పేర్కొనడంతో కదిరి పట్టణ పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు భాగంగా నిందితురాల అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, ఆమెకు 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం ఆమెను అనంతపురం జిల్లా జైలుకు తరలించారు. పోలీసుల విచారణలో డక్కా నందిని, తనకు మరియు తనభర్త డాక్టర్ విజయబాబుకు మధ్య ఉన్న మనస్పర్థలు, కుటుంబ విభేదాలకారణంగా కుమారుడువర్షిత్‌ను చున్నీతో గొంతు బిగించి, అనంతరం నోటిలో గుడ్డలు కుక్కి ఊపిరాడకుండాచేసి హత్య చేసినట్లు అంగీకరించినది. అలాగే, కుమారుడిని హత్య చేసిన అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించినప్పటికీ, ధైర్యం చాలక ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

## వారాహిదేవికి పంచామృతాభిషేకాలు

**తాడిపత్రిఅర్బన్, జూలై 19 ప్రభాతవార్త**



వారాహిదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించిన దృశ్యం

తాడిపత్రి పట్టణంలోని వడ్లపాలెంలో వెలసిన శ్రీకాళికాదేవి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న వారాహిదేవి గుప్త నవరాత్రుల్లో భాగంగా ఆదివారం శ్రీవారాహిదేవికి అర్చకులు వీరబ్రహ్మం ఆచార్యులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వారాహిదేవి గుప్త నవరాత్రుల ఉత్సవాలు ఈ నెల 24వతేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం గణపతిపూజ, శ్రీవారాహి అమ్మవారి పూజ, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, కుంకుమార్చన, విశేష హారతులు, వేద ఆశీర్వాదం, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం



దేవస్థానం ఆవరణలో శుభ్రం చేస్తున్న దృశ్యం

**తాడిపత్రిఅర్బన్, జూలై 19 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది కొత్త వంతెన సమీపంలో ఉన్న సాలిగ్రామ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్ఎస్ఎస్ నాయకులు ప్రభాకర్, నాగరాజు చిన్నారులతో కలిసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని ఆలయం వద్ద నుంచి తీసుకువెళ్లి పక్కకు పడవేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆర్ఎస్ఎస్ నాయకులు ప్రభాకర్ పేర్కొన్నారు.

## సిఐ నారాయణరెడ్డిని సన్మానించిన బిజెపి నాయకులు



సిఐ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**తాడిపత్రిఅర్బన్, జూలై 19 ప్రభాతవార్త**

తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిఐ నారాయణరెడ్డిని ఆదివారం భారతీయ జనతా పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తాడిపత్రిలో శాంతిభద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని భారతీయ జనతా పార్టీ నాయకులు తెలియచేశారు. ఇందుకు సిఐ స్పందిస్తూ ప్రజా సమస్యలు తక్షణ పరిష్కారానికి ప్రయత్నిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు కంబగిరి, తాడిపత్రి పట్టణఅధ్యక్షులు చెన్నారంగనాయకులు, పట్టణప్రధానకార్యదర్శి జే.ఓబిరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు దుద్దుగాళ్ళ వంశీ, ట్రెజరర్ ఎల్.ఈశ్వర్‌రాజు,పట్టణ ఎస్‌సి మోర్చ అధ్యక్షుడు జి.రంగయ్య, జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గసభ్యులు కృష్ణమోహన్, మండల శివ, ముచ్చుకోట శివయ్య, ఎస్‌సి మోర్చా ఉపాధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్యశిబిరం

**తాడిపత్రిఅర్బన్, జూలై 19 ప్రభాతవార్త**

త్నాడిపత్రి పట్టణంలోని నందలపాడులో వున్న మాధవ స్మృతి వికాస్ పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీసరస్వతి శిశు మందిరంలో నంద్యాలకు చెందిన శాంతిరాం మెడికల్ కళాశాల వారిచే ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హాజరైన దాదాపు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## అశ్వత్థనారాయణస్వామికి విశేష పూజలు



అశ్వత్థనారాయణస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

**పెద్దపప్పూరు, జూలై 19 ప్రభాతవార్త**

పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరంలోని అశ్వత్థంలో వెలసిన శ్రీఅశ్వత్థనారాయణస్వామి ఆదివారం విశేష పూజలు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

నిర్వహించారు. ఉదయం అర్చకులు సుధీర్‌కుమార్‌శర్మ, అనిల్‌కుమార్‌శర్మలు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అర్చనలు, మహామంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శ్రీచక్రభీమలింగేశ్వరస్వామికి అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది గురప్ప, అరుణ్ పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు సిఐ కౌన్సిలింగ్



కౌన్సిలింగ్ ఇస్తున్న సిఐ నారాయణరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జూలై 19 ప్రభాతవార్త**

తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 12 మంది రౌడీ షీటర్లకు సిఐ నారాయణరెడ్డి ఆదివారం సాయంత్రం కౌన్సిలింగ్ నిర్వహించారు. తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 12 మంది రౌడీ షీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నట్లయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

## మాల మహానాడు మండల అధ్యక్షునిగా లక్ష్మినారాయణ ఎంపిక



మాలమహానాడు నూతన కమిటీని ఎన్నుకున్న దృశ్యం

**అమడగూరు, జూలై 19 ప్రభాతవార్త**

అమడగూరు మండల కేంద్రంలోని శ్రీచౌడేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం మాలమహానాడు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా మాల మహానాడు మండల అధ్యక్షునిగా కొట్టువారిపల్లి పంచాయతీ కంచరవాండ్లపల్లికి చెందిన లక్ష్మినారాయణను మాల మహానాడు జిల్లా గౌరవ అధ్యక్షులు సి.గంగులయ్య, జిల్లా అధ్యక్షులు ఎంఎం మూర్తి, జిల్లా కార్యదర్శి నేసే జానకిరామ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన తమ కులానికి చేసిన సేవలను గుర్తించి పలువురు ప్రశంసలు కురిపించారు. భవిష్యత్తులో కూడా తమ కులానికి మంచి చేస్తాడనే ముఖ్య ఉద్దేశంతో అతన్ని ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ అధ్యక్షులుగా ఎస్.చలపతి, ఉపాధ్యక్షులుగా పి.మణికంఠ, కార్యదర్శి చెంగలీ శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.నరసింహులు ఏ.శ్రీనివాసులు, ఎం.ఆదినారాయణ, పి.రమణ సూర్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా రెడ్డప్ప, విశ్వనాథ, నారాయణస్వామి, జి.వెంకటరమణ, చిరంజీవి, ప్రసాదు, పి.ఆంజనేయులు, తదితరులు ఎంపిక చేశారు.

## డ్రైవర్ మద్యం మత్తులో లారీ బోల్తా

**అమడగూరు, జూలై 19 ప్రభాతవార్త**



అదుపుతప్పిన లారీ

అమడగూరు మండల పరిధిలోని చిన్నగానపల్లి పంచాయతీ ఆకులవారిపల్లి గ్రామ సమీపంలో లారీ బోల్తాపడింది. వివరాలు ఇలా వున్నాయి. చాకవేలి నుండి కంకర అన్‌లోడ్ చేసి తిరిగి బాగేపల్లికి వస్తుండగా మార్గమధ్యంలోని ఆకులవారిపల్లి వద్దకు రాగానే జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ చందన్వాసన్ మద్యంమత్తు కారణంగా లారీ అదుపుతప్పి బోల్తాపడింది. విషయం తెలుసుకున్న అమడగూరు ఎస్ఐ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జరిగిన ప్రమాద విషయాలపై ఆరా తీశారు.



## డ్రైనేజీ లేక 8వ వార్డు ప్రజల ఇబ్బందులు..


**గార్లదిన్నె, జూలై 19,ప్రభాత వార్త:**

కల్లూరు గ్రామపంచాయతీ 8వ వార్డులో డ్రైనేజీ కాలువలు లేక చిన్న వర్షం వచ్చినా నీరునిలిచి ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను గత సర్పంచ్, ఎమ్మెల్యే దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదనిస్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

← డ్రైనేజీ లేక చిన్న వర్షానికే రోడ్డంతా నీటిమయం..

## పేదలకు ఆర్థిక ఇబ్బందులు రాకూడదని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ**



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, జులై 19 ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఏదైనా ప్రమాదవశాత్తు గాయపడి లేక అనుకోని సంఘటనలు జరిగి ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలకు ఆర్థిక ఇబ్బందులు రాకూడదనే



లబ్దిదారులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.83,34,683లు విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ భోజనాలు ఏర్పాటు చేయించి స్వయంగా వడ్డించారు.

## ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు ప్రారంభం



ఉపాధ్యాయులకు మెమెంటోలను అందజేస్తున్న డా.నిసార్ యాసిన్

**కదిరి, జులై 19 ప్రభాతవార్త**

డా.సర్వేపల్లి రాధకృష్ణ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా) సిమ్స్ వైద్య శాల ఎండి డా.నిస్సార్ యాసిన్ సౌజన్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ క్రికెట్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌ను ఆదివారం ఎస్టీ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభించారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు డా.నిసార్ యాసిన్ చేతులు మీదుగా మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

**- టిడిపి మండల కన్వీనర్ గోరంట్లమారుతినాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు

**శింగనమల, జులై 19 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతినాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ, బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అందించి రెండు జతల టీషర్టులు, నైట్ ప్యాంట్లు, దుప్పట్లు, కాటన్ టవాల్, స్వెట్టర్స్, రన్నింగ్ షూలు కలిగిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మండల కన్వీనర్ మారుతినాయుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి ఆధ్వర్యంలో విద్యా రంగంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, విద్యార్థులను తన కుటుంబంలోని సభ్యుల లాగా



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మంత్రి నారా లోకేష్ పిల్లల చదువుకు కావాల్సిన అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. ఈ నెల 22వ తేదిన తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలోని 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఎంత మంది పిల్లలు చదువుతున్నా వారందరికీ ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున వారి ఖాతాలో జమా చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రామాంజినేయులు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, శింగనమల ఆయకట్టు అధ్యక్షులు బోయ సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు సి.వెంకటేష్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు వీరాంజినేయులు, కోయగూర పెద్దన్న, పెరవలి మాజీ సర్పంచు రాజు, డీలర్ సత్యనారాయణ, విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్లూరులో డీటీఆర్ మిస్టరీపై కదిలిన అధికారులు

**-పుట్లూరు వడ్డెర కాలనీలో డీటీఆర్ ఏర్పాటుకు దిమ్మె సిద్ధం**

**-వార్త వెలుగులోకి రావడంతో కదిలిన విద్యుత్‌శాఖ**

**-బాధ్యులపై చర్యలు తీసుకోనేరా ?**



డీటీఆర్ ఏర్పాటు కోసం దిమ్మె ఏర్పాటు చేసిన దృశ్యం

**వార్త ప్రభావం**

**పుట్లూరు, జూలై 19 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం గతంలోనే 100 కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)ను డ్రా చేసినప్పటికీ, నెలల తరబడి క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ నిర్లక్ష్యాన్ని వార్తా పత్రిక గత నెల 21వ తేదీ "పుట్లూరులో 100కేవిఏ డీటీఆర్ మిస్టరీ" అనే కథనం ద్వారా వెలుగులోకి తీసుకురావడం జరిగింది. ఇందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎట్టకేలకు వడ్డెర కాలనీలో డీటీఆర్ ఏర్పాటు కోసం అవసరమైన దిమ్మె నిర్మాణ పనులు ప్రారంభించారు. త్వరలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తామని అధికారులు తెలిపారు.

**బాధ్యులు ఎవరో :** ట్రాన్స్‌ఫార్మర్‌ను గత సంవత్సరం డిసెంబర్ నెలలోనే డ్రా చేసినప్పటికీ ఇన్నాళ్లు ఎందుకు ఏర్పాటు చేయలేదు ? ఈ జాప్యానికి ఎవరుబాధ్యులు ? స్టోర్ లేదా ఇతర అధికారుల నిర్లక్ష్యమా ? అనే కారణాలు తెలియాల్సి ఉంది. డీటీఆర్ ఏర్పాటుపై వార్త పత్రిక ద్వారా బట్టబయలు చేయకపోతే వాటినిమాయంచేసేవారేమో? అన్నసందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సి ఉంది. ఉన్నతధికారులు ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి మరి. భవిష్యత్తులో ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై మరింతనమ్మకం పెరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ పోరుబాటలో మండల వైఎస్ఆర్‌సిపి నేతలు



హంద్రీనీవా కాలువ వద్ద మండల వైఎస్ఆర్‌సిపి నేతలు

**శింగనమల, జులై 19 ప్రభాతవార్త**

హంద్రీనీవా ప్రాజెక్టు పరిరక్షణ కోసం వైఎస్ఆర్‌సిపి చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో ఆదివారం ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం చోళ సముద్రం సమీపంలో హంద్రీనీవా కాలువను వైఎస్ఆర్‌సిపి జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డితో కలిసి నియోజకవర్గ సమన్వయ కర్త మాజీ మంత్రి శైలజానాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల మండలం నుంచి వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగం నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, మాజీ నియోజకవర్గ సమన్వయ కర్త ఎం.వీరాంజినేయులు, శివపురం తిరుపతయ్య, గార్లదిన్నె సుధాకర్‌రెడ్డి, దుద్దుకుంట భాస్కర్‌రెడ్డి, వైసిపి యూత్ నాయకుడు వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

## యోగాసనా భారత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఉరవకొండ విద్యార్థులు

**జిల్లా కేంద్రం అనంతపురంలో వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ**



యోగాసనా భారత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉరవకొండ విద్యార్థులు

**ఉరవకొండ, జూలై 19 ప్రభాతవార్త**

యోగాసనా భారత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఉరవకొండ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని యోగా గురువు, నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రం అనంతపురంలోని స్వామి వివేకానంద భవన్ లో జరిగిన 7వ జిల్లా యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలలో ఉరవకొండ పట్టణంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచారన్నారు. లక్ష్మీ నరసింహ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి సాత్విక్ ఆర్టిస్టిక్ సింగల్ ఈవెంట్లో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. గురుసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ ట్రెడిషనల్ యోగాసన పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఎస్.కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి గిరిధర్ ఆర్టిస్టిక్ సింగల్ అంశంలో తృతీయ స్థానంలో నిలిచాడన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినులు సమీనా భాను, ఉషశ్రీ ఆర్టిస్టిక్ యోగాసన ఫెయిర్ బాలికల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారని ఆయన వివరించారు.

## సూర్యనారాయణస్వామిను దర్శించుకున్న ఎంపీడీవో శివ నాగజ్యోతి

**-సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించిన ఆలయ కమిటీ బాధ్యులు**

**ఉరవకొండ, జూలై 19 ప్రభాతవార్త**



ఎంపీడీవో శివనాగజ్యోతి దంపతులను సత్కరించి ప్రసాదం అందిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి గ్రామంలోగల చోళరాజుల కాలం నాటి దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధి చెందిన సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం వజ్రకరూరు ఎంపీడీవో శివ నాగజ్యోతి సందర్శించారు. సూర్యనారాయణస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించిన ఎంపీడీవో దంపతులను ఆలయ కమిటీ బాధ్యులు శాలువాకప్పి సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మెన్ చిరంజీవి, సభ్యులు, మహేంద్రగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

# అబ్బురపరిచిన మానస నృత్య కళాకేంద్రం ప్రదర్శనలు

రవీంద్రభారతిలో నాట్యవైభవం

నాట్యగురువు మానస, శిష్యబృందానికి ఘన సన్మానం



మానసను సన్మానిస్తున్న సినిమా యాక్టర్స్ కరాటి కళ్యాణి,ఎంపీ ఆర్ కృష్ణయ్య, దైవజ్ఞశర్మలు

ధర్మవరం టౌన్, జూలై 19 ప్రభాతవార్త

ధర్మవరానికి చెందిన మానస నృత్య కళాకేంద్రం శిష్యబృందం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా తెలంగాణ బోనాల జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ నృత్యాలను కళాత్మకంగా ఆవిష్కరించిన బృందం ప్రదర్శనలకు ప్రేక్షకుల నుంచి ఘనమైన ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సినీనటి కరాటే కళ్యాణి, ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎంపీ దైవజ్ఞశర్మ నాట్యగురువు మానసతో పాటు ఆమె శిష్యబృందాన్ని శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ...... భారతీయ సంస్క ృతి, సంప్రదాయాలను నృత్య కళ ద్వారా భావితరాలకు చేరవేయడంలో యువ కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ధర్మవరం పేరు రాష్ట్రస్థాయిలో నిలబెట్టిన మానస నృత్య కళాకేంద్రం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు

యువర్స్ ఫౌండేషన్ చొరవతో కార్నియా సేకర

ధర్మవరంటౌన్, జూలై 19 ప్రభాతవార్త

ధర్మవరం పట్టణంలోని మార్కెట్ వీధికి చెందిన రేపాకుల సుబ్బలక్ష్మమ్మ (79) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె మరణానంతరం యువర్స్ ఫౌండేషన్ సభ్యులు కుటుంబ సభ్యులకు నేత్రదానం యొక్క ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు అంగీకరించడంతో అనంతపురం రెడ్ క్రాస్ డీ వై కుళ్లాయప్ప కంటి రిట్రావెల్ సెంటర్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ జజి రాఘవేంద్ర మృతురాలి రెండు కంటి కార్నియాలను విజయవంతంగా సేకరించారు. ఈ నేత్రదానం ద్వారా మరో ఇద్దరు దృష్టి లోపం ఉన్న వారికి వెలుగు ప్రసాదించే అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారులు రేపాకుల సూరి, సుధాకర్, కిశోర్, అశోక్, కుమార్తె రేణిగుంట్ల శ్రీదేవి, అలాగే యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధి శీలా నాగేంద్ర నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులను అభినందించారు. యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ సుబ్బారావు, గర్రె రమేష్‌బాబు, కేతా లోకేష్ కుటుంబ సభ్యులకు, కృతజ్ఞతలు తెలియజేశారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# బలిజ సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి

- ధర్మవరంలో శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం నూతన కమిటీ పరిచయస
- శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి మాసపల్లి సాయికుమార్ - బలిజ సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తా: కదిరింటి శ్రీరాములు - జై బలిజ నినాదాలతో మార్మోగిన బలిజ కళ్యాణ మండపం



ధర్మవరంలో నిర్వహించిన శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం నూతన ఆత్మీయత పరిచయ కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న సంఘం నాయకులు.

ధర్మవరం టౌన్, జూలై 19 ప్రభాతవార్త

ధర్మవరం పట్టణంలోని మాధవనగర్‌లో ఉన్న బలిజ కళ్యాణమండపంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయల బలిజ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఆత్మీయ పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం సీనియర్ నాయకుడు నీలయ్యగారి ఫణికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా కదిరింటి శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా బొడ్డు చంద్ర, గంధోడి రాజా, ప్రధాన కార్యదర్శిగా గుండ్లపల్లి ధనుంజయ, సంయుక్త కార్యదర్శులుగా సాయి కిరణ్, పసుపులేటి విశ్వనాథ్, ఖజాంచీలుగా బి.జి. రామాంజనేయులు, జి. లక్ష్మన్న, కార్యవర్గ సభ్యులుగా గుండ్లపల్లి రామ్మోహన్, ఎ. లక్ష్మీనారాయణ, రాప్తాటి రవీంద్ర ప్రసాద్, ముప్పే ఓం ప్రకాష్, పసుపులేటి వెంకటేశులు, పాకం వెంకటరమణ, కామనూరు సుధాకర్, తుమ్మల సుబ్రమణ్యం, గంటపర నాగరాజు, పద్మ మణికంఠ, పాల్యం మంజునాథ, దాసరి సురేంద్ర, చిన్నకోట్ల భీమయ్య తదితరులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కదిరింటి శ్రీరాములు మాట్లాడుతూ బలిజ సంఘం అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ధర్మవరం పట్టణంలోని 40 వార్డుల బలిజ సోదరులను కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని, త్వరలో ప్రతి వార్డుకు ఇన్‌చార్జీలను నియమిస్తామని వెల్లడించారు. ధర్మవరం మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ, విజయనగర సామ్రాజ్యాన్ని సుసంపన్నంగా తీర్చిదిద్దిన మహారాజు శ్రీకృష్ణదేవరాయల జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. చెరువుల నిర్మాణం, వ్యవసాయాభివృద్ధి, ప్రజాహిత పరిపాలనలో ఆయన చూపిన దూరదృష్టి నేటికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. కుల సంఘాలు ఐక్యతకు వేదికలుగా మారి విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, పేద విద్యార్థులకు సహాయ కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. బలిజలంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లి ధనుంజయ మాట్లాడుతూ, దేశభాషలందు తెలుగు లెస్స అని కొనియాడిన శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తితో బలిజ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఒక ఇంటికి పునాది ఎంత ముఖ్యమో, సంఘానికి బలమైన కమిటీ అంతే ముఖ్యమని, పెద్దల సలహాలు, సూచనలతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమం ముగింపులో బలిజ సోదరులు జై బలిజ - జై జై బలిజ, జై శ్రీకృష్ణదేవరాయలు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ధర్మవరం పట్టణం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బలిజ సంఘ సభ్యులు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతులు పంటల బీమా నమోదు చేసుకోండి

- మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

చెన్నేకొత్తపల్లి, జులై 19 ప్రభాతవార్త

చెన్నేకొత్తపల్లి మండలంలోని రైతులు ఇంకా తమ పంటలకు భీమా చేసుకోని రైతన్నలు వెంటనే నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద కంది, మొక్కజొన్న, రాగి, ఆముదం పంటలకు ఈ నెల 31, వరి పంటకి మాత్రమే ఆగస్టు 15 వరకు గడువు ఉందని, అదే విధంగా వాతావరణ ఆధారిత బీమా పథకం కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, టమాటా, చీనీ పంటలకు ఈ నెల 24 ఆఖరి గడువు అని ఆ లోపు రైతులందరు తమ పంటలకు భీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు.

# ఉచిత కంటి ఆపరేషన్లు శిబిరమునకు విశేష స్పందన



కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్న దృశ్యాలు

చెన్నేకొత్తపల్లి, జులై 19 ప్రభాతవార్త



రోటరీ క్లబ్, ఆత్మీయ ట్రస్ట్ ధర్మవరం సంయుక్తంగా చెన్నేకొత్తపల్లి మండలం వెంకటం పల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషుల జర్రీ పోతుల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల దాతృత్వంతో, ఆదివారం చెన్నేకొత్తపల్లి హై స్కూల్‌లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్లు శిబిరానికి విశేష స్పందన లభించిందని, ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టి పి.జయ చంద్రారెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు జయసింహా, నరేంద్ర రెడ్డి, వెంకటేష్ తెలియజేశారు. క్యాంపులో 61 మంది హాజరవగా అర్హులైన వారు 31మంది ఈ ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని ఆదివారం మధ్యాహ్నం బెంగళూరుకి బస్సులో తీసుకెళ్లి అక్కడ బెంగళూరులోని శంకర్ నేత్రాలయంలో ఈ ఆపరేషన్లు ఉచితంగా శస్త్రచికిత్స చేసి కంటి అద్దాలు ఇవ్వబడునని ఆత్మీయ ట్రస్ట్ ప్రతినిధులు రోటరీ ట్రస్ట్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కొండయ్య, సూర్యనారాయణ రెడ్డి, ధర్మవరం పట్టణ ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ నరసింహులు నాయకులు రామకృష్ణ నాయక్, అమర్ నారాయణరెడ్డి, పెద్దకోట్ల సురేష్, రామాంజనేయులు, ఎం.సుధాకర్, నారాయణస్వామి, రమేష్ క్యాంపు సహకరించిన కుటుంబ సభ్యులు మదన్ మోహన్ రెడ్డి, సావిత్రి, శివశంకర్ రెడ్డి, అనిత, రామ్మోహన్ రెడ్డి, రాజేశ్వరి, నిర్మలాదేవి వెంకట్ కౌశిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాంపు సహకరించిన జరిపోతుల వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను రోటరీ ఆత్మీయ ట్రస్ట్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

# "షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ 2026" ప్రధానోత్సవం

హాజరుకానున్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ మరియు ప్రజాప్రతినిధులు



షైనింగ్ స్టార్ అవార్డులో ప్రధాన ఉత్సవానికి సర్వం సిద్ధం

కొత్తచెరువు జులై 19. ప్రభాతవార్త

మార్చి 2026 పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కళాశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి సన్మాన కార్యక్రమం షైనింగ్ స్టార్స్ జూలై 20న సోమవారం ఉదయం 10 గంటల నుండి పుట్టపర్తి రూరల్ పరిధి లో జగరాజు పల్లి క్రాస్ వద్ద ఉన్న మహి శ్రీనివాస గార్డెన్స్ నందు ఘనంగా నిర్వహించబడతాయని డీఈవో జి కృష్ణప్ప, డి ఐ ఈ ఓ చెన్నకేశవ ప్రసాద్ లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి 201 మంది విద్యార్థులు ఎంపికయ్యారు అలాగే జిల్లాలో కళాశాలల నుండి 36 మంది విద్యార్థులను ప్రభుత్వం వారు ఎంపిక చేయడం జరిగినది ..మొత్తం 237 మంది విజేతలకు మెడల్, ప్రశంసా పత్రం, మరియు రూ. 20,000/ నగదు బహుమతి (చెక్ రూపంలో) అందజేయబడుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉదయం 08:00 గంటలకల్లా నిర్దేశిత డ్రెస్ కోడ్‌తో వేదిక వద్దకు చేరుకోవాలని తెలియజేయడమైనది ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

# ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న తోపుడు బండ్ల తొలగింపు

- వన్ టౌన్ సీఐ ఆదేశాలతో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
- రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు
- రోడ్ల ఆక్రమణలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న రోడ్డుపై తోపుడు బండ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సూర్యనారాయణ , సిబ్బంది.

ధర్మవరం టౌన్, జూలై 19 ప్రభాతవార్త

ధర్మవరం పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న రోడ్ల ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వన్ టౌన్ సీఐ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారులపై తనిఖీలు నిర్వహించి, రోడ్డుకు అడ్డంగా నిలిపిన తోపుడు బండ్లు, ఇతర ఆక్రమణలను తొలగించారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. వ్యాపారులు తమ తోపుడు బండ్లు, వస్తువులను రహదారులపై కాకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# నేటి నుంచి డాక్యుమెంట్ రైటర్ల నిరవధిక పెన్‌డౌన్ సమ్మె

- రిజిస్ట్రేషన్ విధాన మార్పులకు వ్యతిరేకంగా ఆందోళన
- జీవనోపాధి పరిరక్షణకు ప్రభుత్వాన్ని కోరిన దస్తావేజు లేఖరులు - జూలై 31 వరకు సమ్మె కొనసాగనున్నట్లు సంఘం ప్రకటన



పెన్‌డౌన్ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడిస్తున్న దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ధర్మవరం పట్టణ అధ్యక్షుడు జావిద్, కార్యదర్శి జూటూరు మహేంద్ర తదితరులు.

ధర్మవరంటౌన్, జూలై 19 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రిజిస్ట్రేషన్ సేవల విధాన మార్పులకు నిరసనగా ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిరవధిక పెన్‌డౌన్ సమ్మె చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ధర్మవరం పట్టణ అధ్యక్షుడు జావిద్, కార్యదర్శి జూటూరు మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (శిశి) విధానంలో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వారు పేర్కొన్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిగా ఆన్‌లైన్‌కు పరిమితమై, డాక్యుమెంట్ రైటర్ల ప్రమేయం లేకుండానే ప్రక్రియలు పూర్తయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల లక్షలాదిమంది డాక్యుమెంట్ రైటర్లు తమ జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, డాక్యుమెంట్ రైటర్ల హక్కులు, జీవనోపాధిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు జూలై 20 నుంచి 31వ తేదీ వరకు ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ సమ్మె కొనసాగుతుందని సంఘం నాయకులు స్పష్టం చేశారు.

# నరేంద్రసింగ్ బేడీ.. ఘనంగా నివాళులు

స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు..



నరేంద్ర సింగ్ బేడి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం సామాజిక ఉద్యమ నేత యంగ్ఇండియా ప్రాజెక్ట్

పెనుకొండ జులై19 ప్రభాతవార్త

సామాజిక ఉద్యమ నేత, పేదల పెన్నిధి దివంగత నరేంద్రసింగ్ బేడి 88వ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం గుట్టూరు ఫారం లోని ఆయన సమాధివద్ద నిర్వహించిన జయంతి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి ఆయన అభిమానులు, సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆయన సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలో జన్మించి విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి 55 సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లాకు విచ్చేసిన నరేంద్రసింగ్ బేడి ఇక్కడి దుర్భిక్ష ప్రాంతాన్ని చూసి చలించిపోయి, ఇక్కడి పేదప్రజలకు ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి లక్షలాదిమంది పేద ప్రజల ఆకలి తీర్చడమే కాకుండా, వారి కనీస హక్కుల కోసం పోరాటం చేసిన పోరాట యోధుడని, కరువును ఎలా జయించాలి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలు ఏ విధంగా సాధించుకోవాలి, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పేదలకు అవగాహన కల్పిస్తూ వాటి సాధన కోసం ఎంతో కృషి చేశాడని, చేపపట్టిఇస్తే మనిషి మారడు.... పట్టే విధానం నేర్పి చూడు బాగుపడతాడు అన్న సిద్ధాంతంతో పేదప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలియజేస్తూ, అణగారిన వర్గాలను రాజకీయంగా చైతన్య పరుస్తూ పేదప్రజల రాజ్యాధికారం కోసం ఎంతో కృషిచేశాడని ఇందులో భాగంగా వందలాదిమంది స్థానిక సంస్థలలో గ్రామ సర్పంచులుగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా ఎంతోమంది నాయకులను తయారు చేశాడని, పదిమందికి ఉద్యోగం కల్పించే విధంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులుగా తయారు చేసి ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మందికి సేవచేసే భాగ్యం కల్పించిన మానవతావాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు వెంకటేశులు, కృష్ణమూర్తి, రెడ్స్ సంస్థ అధ్యక్షుడు వి.కృష్ణప్ప, జన జాగృతి సంస్థ అధ్యక్షుడు బలరాం, ఎంజీవైఎస్ అధ్యక్షుడు నరసింహులు, పాస్ రామప్ప, రెడ్స్ భానుజా, రాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా 31912 వ ర్యాంక్ శ్రీశాంత్ యాదవ్‌కు ఘన సన్మానం

: యాదవ సంఘం నాయకులు



శ్రీశాంత్ యాదవ్ కు ఘనంగా సన్మానించిన సోమందేపల్లి మండల యాదవ సంఘం నాయకులు

సోమందేపల్లి జూలై 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ చెందిన ఓబులేష్ యాదవ్ సుకన్య దంపతుల కుమారుడు శ్రీశాంత్ యాదవ్ ఆల్ ఇండియా నీట్ ఎగ్జాంలో 720 /557 మార్కులు సాధించడం జరిగింది. కావున శ్రీ వేణు మాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ సంఘం తరఫున నక్కలగుట్ట హిందూపూర్ రోడ్డు పక్కన శ్రీకృష్ణుడి గుడి నిర్మాణం ప్రాంగణంలో శ్రీశాంత్ యాదవును సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా యాదవ సంఘం మండల అధ్యక్షులు మహేష్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితులలో లక్షలమంది కాంపిటేషన్తో నీట్ ఎగ్జాం రాయడం జరుగుతుందని అలాంటి పరీక్షలలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణం అని వారి కుటుంబానికే కాకుండా తమ కులానికి కూడా సంతోషదాయకమని అదేవిధంగా గ్రామానికి మండలానికి కూడా ఒక మంచి స్థానం సాధించుకున్నట్లుగా భావించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు శ్రీశాంత్ యాదవ్ కు శ్రీకృష్ణుడి ఆశీస్సులు దీవెనలు ఎల్లప్పుడూ ఉంటాయని అదే విధంగా తమ కులస్తులందరి నుండి శుభాశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని సహాయ సహకారాలు కూడా ఉంటాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శ్రీ వేణు మాధవ యాదవ్ వెల్ఫేర్ సొసైటీ సంఘం మండల అధ్యక్షులు జి మహేష్ యాదవ్, మండల సలహాదారులు జి పి నరసింహులు, ఉపాధ్యక్షులు అమరప్ప యాదవ్, మాజీ కోశాధికారి ధను యాదవ్, యూత్ కమిటీ అధ్యక్షులు మైలార్ యాదవ్, యూత్ కమిటీ నాయకులు ఓబులేష్ యాదవ్, సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి రాజగోపాల్ యాదవ్, డీలర్ రమేష్ యాదవ్, మనోజ్ యాదవ్, శ్రీశాంత్ తల్లి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# కెంపెగౌడ విగ్రహమునకు స్థలం

పరిశీలన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన దృశ్యం

అమరాపురం జులై 19 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అమరాపురంలోని తహసిల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారి కూడలిలో కెంపెగౌడ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన ఆదివారం హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి,వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణలు చేపట్టారు. ఈ సందర్భంగా వక్కలిగా సేవాసమితి సభ్యులు విచ్చేసిన ప్రముఖులకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విగ్రహ ఏర్పాటుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని విచ్చేసిన ప్రముఖులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వక్కలిగా సేవా సమితి సభ్యులు కృష్ణమూర్తి, విశ్వేశ్వర, గణేష్, సాయి విద్యానికేతన్ కరెస్పాండెంట్ యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, సప్లయర్ రాఘవేంద్ర,, టైల్స్ నాగభూషణ్, బోర్ వెల్ నగేష్, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, గౌడనకుంటహనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మహిళా యాదవ సంఘం కార్యదర్శిగా శోభ యాదవ్



యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు నుండి జిల్లా మహిళా కార్యదర్శిగా అనుమతి పత్రాన్ని స్వీకరిస్తున్న శోభా యాదవ్

సోమందేపల్లి జూలై 20 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని గోరంట్ల మండలం నివాసి అయిన శోభా యాదవ్ అఖిలభారత యాదవ మహాసభ జిల్లా కార్యదర్శిగా శోభా యాదవ్ న ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యాదవ సంఘం జిల్లా కమిటీ తెలియజేసింది ఈ సందర్భంగా జిల్లాలో అత్యధికంగా యాదవ మహిళలు వెనుకబడి ఉన్నారని వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి అన్ని రంగాలలో ముందుకు నడిపించే విధంగా అఖిల భారత యాదవ సంఘం కృషి చేస్తుందని తెలియజేశారు తమపై ఎంతో నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకొన్న శోభా యాదవ్ పాత్రికేయుడు తో మాట్లాడుతూ జిల్లాలోని గ్రామస్థాయి నుండి యాదవ కుల మహిళలు లో చైతన్యం తీసుకువచ్చి అన్ని రకాలుగా అభివృద్ధి చెందడానికి తమ వంతు కృషి చేస్తానని వివరించారు జరిగిన సమావేశంలో తమ ఎన్నికకు కృషిచేసిన యాదవకుల సంగం నాయకుల గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నాయకులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ఆమె తెలియజేసింది ఈ సమావేశంలో యాదవ పెద్దలు మండల నియోజకవర్గ జిల్లా యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# నేడు ఎస్ ఎస్ సి ప్రతిభావంతులకు షైనింగ్ స్టార్ పురస్కారాలు

అమరాపురం జూలై 19 ప్రభాతవార్త



ఎంఈఓ దృశ్యం

మండలంలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో మార్చి-2026 ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం "షైనింగ్ స్టార్" పథకం కింద ఒక్కో విద్యార్థికి రూ.20,000 నగదు (చెక్ రూపంలో), మెడల్ మరియు ప్రశంసా పత్రం నేడు సోమవారం అందజేయనున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. మహీ శ్రీనివాస గార్డెన్స్, జగరాజుపల్లి, గోరంట్ల రోడ్, మంగళకర స్కూల్ ఎదురుగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఎంపికైన విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలనికోరారు. అమరాపురం మండలంలో ఏపీ మోడల్ స్కూల్ నుంచి అమూల్య, అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల నుండి ప్రత్యూష, కేజీబీవీ నుండి లావణ్య, శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల నుండి ఆర్ కృష్ణవేణి, లికిత్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంటనే విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, కార్యక్రమానికి హాజరగున్నట్టు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పలువురు విద్యార్థులు వివిధ కళాశాలల్లో చేరి దూర ప్రాంతాల్లో ఉన్నందున, వారికి తప్పనిసరిగా సమాచారం చేరేలా చూడాలని తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వజ్రకరూరు జూలై 19 ప్రభాతవార్త



మృతుడు ఉమ్లా నాయక్

మండలంలోని వెంకటం పల్లి పెద్ద తండా చెందిన కొర్ర ఉమ్లా నాయక్(39) బైక్ పై నుండి కింద పడి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.... మృతుడు ఉమ్లా నాయక్ తమ్ముడు చికెన్ నాయక్ ఇద్దరు కలిసి గ్రామంలో జరుగునున్న చెట్టు దేవర కొరకు ఉరవకొండలో చదువుతున్న కొడుకు యోగేంద్ర నాయక్ ను పిలుచుకు రావడానికి వెళ్లారు. కొడుకుని పిలుచుకొని తిరిగి గ్రామానికి వస్తుండగా పందికుంట గ్రామం దాటిన తర్వాత మార్గమధ్యంలో బైక్ రోడ్డు ప్రక్కన ఉన్న రాయిని ను ఢీకొనడంతో మృతుడు కిందపడి తలికి తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉరవకొండ పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గొనుగుంట్ల నాగేంద్ర నాయకులు చాబా ఎర్రి స్వామి, నాగన్న, వద్దే శ్రీరాములు ఆస్పత్రికి పెరిగి మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి సీనియర్ నాయకులు శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు భార్య స్వప్న భాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగ స్వామి తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

